క్లుప్తంగా

సన్మానం



రాజేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న జడ్జి, న్యాయవాదులు

విజయనగరం లీగల్: జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో బదిలీపై గుంటూరుకు వెళ్తున్న స్థానిక అదనపు సీనియర్ సివిల్ జడ్జి టీవీ రాజేష్‌కుమార్‌ను న్యాయవాదులు గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత, బార్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కోలగట్ల తమ్మన్న శెట్టి, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రవిబాబు, ఎస్.సురేష్, ఉపాధ్యక్షుడు పి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది అరెస్ట్



పట్టుబడిన వారితో ఎస్ఐ సన్యాసినాయుడు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ, బీబీజీ లేఅవుట్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు గురువారం తెలిపారు. డెంకాడ ఎస్ఐ, విజయనగరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి, జూదరులను పట్టుకున్నామని వారి నుంచి రూ.15 వేల నగదు, రెండు ఆటోలు, నాలుగు మోటార్‌బైక్‌లు, ఎనిమిది ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారి

విజయనగరం: నగరంలోని 42వ డివిజన్, కామాక్షినగర్‌లో జరుగుతున్న సీసీ కాలువ నిర్మాణం సహా ఆదిత్య థియేటర్ వద్ద జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను డీఈ శ్రీనివాసరావు, ఏఈ సుధాకర్ గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎక్కడైనా నాణ్యత లోపించినట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిషేధిత పాలిథిన్ కవర్లు వాడొద్దు



దుకాణంలో పాలిథిన్ సంచుల విక్రయాలపై తనిఖీలు చేస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించి, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం పలు దుకాణాలకు వెళ్లి, నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నదీ లేనిదీ తనిఖీలు చేశారు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్‌లతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో నిషేధిత పాలిథిన్ కవర్లను విక్రయించవద్దని, ఎక్కడైనా విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పక్కాగా చెత్త సేకరణ జరగాలి



అలుగోలులో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణరాజు

నెల్లిమర్ల రూరల్: ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పక్కాగా చేయాలని ఎంపీడీవో రామకృష్ణరాజు ఆదేశించారు. మండలంలోని అలుగోలు గ్రామంలో గురువారం పర్యటించిన ఆయన అక్కడి పారిశుధ్య పరిస్థితులు, చెత్తసేకరణ వంటి విషయాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోజూ కాలువల్లోని చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు అందులోని పూడికలు తొలగించి బయట పారవేయాలన్నారు. అలాగే సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి, ఎరువు తయారు చేయాలన్నారు. పారిశుధ్య పనులను కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని, నీటి నాణ్యతను పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శంకర జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

మన అప్రమత్తతే..

మూగజీవాలకు రక్ష!

- పశువులను తీవ్రంగా వేధిస్తోన్న సీజనల్ వ్యాధులు
- అజాగ్రత్తగా ఉంటే మూగజీవాలను కోల్పోయే అవకాశం
- అప్రమత్తతతోనే జీవాలను కాపాడుకోవచ్చు



గొంతువాపు వ్యాధి కారణంగా నోటిపుండుతో బాధపడుతున్న గేదె



గాలికుంటు వ్యాధి వల్ల పశువు కాలి గిట్ల వద్ద పుండ్లు

డెంకాడ: వర్షాకాలంలో మూగజీవాలను సీజనల్ వ్యాధులు వేధిస్తుంటాయి. మారుతున్న వాతావరణానికి సర్దుబాటు చేసుకునే క్రమంలో పశువులు వివిధ వ్యాధుల బారినపడతాయి. ఈ సమయంలో జీవాల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే వాటిని కోల్పోయే ప్రమాదం ఉందని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. వానాకాలంలో పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల బారినపడే పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు వంటి వాటిని వెంటనే పశువైద్య కేంద్రానికి తరలించి, చికిత్స అందజేయాలని సలహా ఇస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం కావడంతో పశువులకు వచ్చే వాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పశువైద్యాధికారి శ్రీకాంత్ సూచనలతో ప్రత్యేక కథనం..

గొంతువాపు వ్యాధి..

వర్షాల సమయంలో పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి అత్యంత ప్రమాదకరమైనది. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గి ఈ వ్యాధి సంభవిస్తుంది. పశువుకు 104 నుంచి 106 డిగ్రీల జ్వరం, కంటి నుంచి నీరు, నోటి నుంచి సొంగ కారడం, గురక, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది వంటివి ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి సోకిన 24 గంటల్లోనే పశువు చనిపోయే ప్రమాదం ఉంది.

నివారణ చర్యలు..

ఈ వ్యాధి పశువులకు రాకుండా ఐదేళ్లలో మొత్తం తొమ్మిది సార్లు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి. వ్యాధితో బాధపడుతున్న పశువులను మిగతా పశువుల నుంచి వేరు చేసి, నోటిలోని పుండ్లకు నివారణగా బోరిక్ పొడరు, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లు నివారణకు పరమాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె రాయాలి. అనంతరం పశువైద్యాధికారిని సంప్రదించి, ఆయన సలహా మేర మందులు వాడాలి.

జబ్బవాపు వ్యాధి..

ఆరు నెలల నుంచి రెండేళ్ల వయసున్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాలకు ఈ వ్యాధి ఆశించి మాంసాన్ని కుళ్లిపోయేలా చేస్తుంది. వాపు కారణంగా పశువులు కుంటుతుంటాయి. వాపు వద్ద కరకరమని శబ్దం కూడా వస్తుంది.

నివారణ చర్యలు..

జబ్బవాపు వ్యాధి రాకుండా పశుసంవర్ధక శాఖ అందించే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి ప్రబలిన వెంటనే పెన్సిలిన్ వంటి యాంటీ బయాటిక్ మందు వేయాలి. మంద నుంచి పశువులను వేరు చేయాలి. ఒకవేళ మూగజీవి మరణిస్తే గొయ్యిలో పూడ్చిపెట్టాలి.

నివారణ చర్యలు..

వర్షాకాలానికి ముందే పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. ఇది అంటు వ్యాధి కావడం వల్ల ఒక పశువు నుంచి మరొక పశువుకు చాలా సులభంగా సోకగలదు. ఈ నేపథ్యంలో వ్యాధి బారిన పశువును మిగతా పశువుల నుంచి వేరు చేయాలి. ఆ తర్వాత పశువైద్యుని వద్దకు తీసుకువెళ్లి, చికిత్స అందజేయాలి.

గాలికుంటు వ్యాధి..

కలుషితమైన గాలి, వైరస్ సోకడం వల్ల ఈ వ్యాధి సంభవిస్తుంది. తల్లిపాల ద్వారా దూడలకు కూడా ఈ రోగం వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఏటా గేదెలు, ఆవులు, ఎద్దులకు ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన పశువులకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. అలాగే నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి, నడవలేని స్థితికి చేరుకుంటాయి. మేత కూడా సరిగా తీసుకోకపోవడంతో పాటు పశువు పూర్తిగా నీరసించిపోతుంది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వర్షాల వల్ల నేలచిత్తడిగా ఉండడం వల్ల పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి కనిపించిన పాడిఆవులు, గేదెల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. చూడి పశువులకు ఈ వ్యాధి సోకితే మరింత ప్రమాదం.

వేంకటేశ్వరస్వామి అలంకరణలో జగన్నాథస్వామి



రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా రోజుకో అవతారంలో జగన్నాథ స్వామి భక్తులకు దర్శనమిస్తున్నారు. విజయనగరంలోని కాళ్లనాయుడు, కోళ్లబజారు ప్రాంతాల్లోని ఆలయాల్లో కొలువైన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడిని గురువారం వేంకటేశ్వరస్వామిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రత్యేకాలంకరణలోని స్వామిని చూసి తరించేందుకు భక్తులు పోటెత్తారు. విశేష పూలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కాళ్లనాయుడు మందిరంలో కొలువుదీరిన జగన్నాథస్వామిని ఈ చిత్రంలో చూడొచ్చు.

–విజయనగరం టౌన్

తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలి



ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం కార్మికులు, ఆయాలు, వాచ్‌మన్‌లకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ విజయనగరం అధ్యక్షుడు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జూలై 9వ తేదీన చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును నగరంలోని ఎంఈవో కార్యాలయంలోని అధికారులకు కార్మికులతో కలిసి గురువారం అందజేశారు. కార్మికులందరికీ కనీస వేతనం అందివ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సదుపాయాలు లేని వారికి ఆయా సదుపాయాలు కల్పించాలని, సాధారణ సిక్ లీవులతో పాటు రాష్ట్ర, జాతీయ పండగ దినాల సెలవులు, మెటర్నిటీ సెలవులు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నందిని, ఉమా, సత్యవతి, ముత్యం, సత్య రాధా సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం గంటస్తంభం

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి



సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నేత సూర్యనారాయణ

భోగాపురం: కార్మిక రంగానికి నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కార్మికులతో కలిసి మండల కేంద్రంలో ఎంఈవోను గురువారం కలిసి సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన సమ్మె చేస్తున్నామని తెలిపారు. ప్రతి కార్మికుడు ఈ సమ్మెలో పాల్గొని, తమ నిరసన గళం విప్పాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్స్యూరెన్స్ సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాజాం సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయం వద్ద మోకాళ్లపై కూర్చొని గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని 58 రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నా, గత నెల 22వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులు సమ్మెను విరమించి విధుల్లోకి రాకుంటే ఉద్యోగాలు తొలగిస్తామని అధికారులతో నోటీసులు ఇప్పించి బెదిరింపులకు పాల్పడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమ్మెతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షులు, నాయకులు రామ్మూర్తినాయుడు, మరియదాసు, శారద, నర్సింగరావు, కృష్ణ, భాస్కరరావు, చిరంజీవి, రాజు, లక్ష్మి, ప్రసన్న,తదితరులు పాల్గొన్నారు.

వితరణ



నిత్యావసర సరుకులు అందించిన సర్పంచ్ రఘు

పూసపాటిరేగ: మండలంలోని నక్కానపేట షిర్డీ సాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించి, అన్నదానానికి గాను రూ.70 వేలు విలువైన నిత్యావసర సరుకులను కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు గురువారం వితరణ చేశారు. 20 బస్తాల బియ్యం, 20 డబ్బాల నూనె, రూ.12 వేలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

వీధి దీపాల మరమ్మతులు



వీధి దీపాలు సరిచేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

విజయనగరం: నగరంలోని పలు వీధుల్లో మరమ్మతులకు గురైన దీపాలను గురువారం బాగుచేశారు. వెలగని బల్బుల స్థానంలో కొత్త బల్బులు వేయడంతో పాటు పాడైన లైట్‌సెట్లను సరిచేశారు. నగరమంతటా వెలుగులు విరజిమ్మేలా నగర కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు విద్యుత్ బల్బుల ఏర్పాటు, మరమ్మతుల చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు.

పూర్ణాహుతి రేపు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని బృందావన్ వ్యాలీలో కొలువైన శ్రీవారాహి అమ్మవారి సన్నిధిలో పూర్ణాహుతి కార్యక్రమం ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం చేపడతామని, అనంతరం మహాన్నదాన కార్యక్రమం చేస్తున్నామని అర్చకులు సంతోష్‌కుమార్ తెలిపారు.

బైక్ మెకానిక్‌ల దినోత్సవం



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం: పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో టూ వీలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ బైక్ మెకానిక్‌ల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. బైక్ మెకానిక్‌లు ఏర్పాటు చేసిన సమావేశానికి అతిథిగా పట్టణ సీఐ అశోక్ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బైక్ మెకానిక్‌లది కీలకపాత్ర అని అన్నారు. బైక్ మెకానిక్‌లు బాధ్యతగా వ్యవహరించాలని, నిబంధనల ప్రకారం కాలంచెల్లిన వాహనాలు వినియోగించవద్దని, వాటి వల్ల కలిగే అనర్థాలను వాహనచోదకులకు వివరించాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు తీసుకొచ్చే బైక్‌లపై దృష్టిసారించాలన్నారు. అనంతరం సీఐని బైక్ మెకానిక్‌లు సత్కరించారు. అంతకుముందు రాజాం పట్టణంలో రాజాం టౌన్, మండలం, రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, తెర్లాం తదితర ప్రాంతాలకు చెందిన వందలాదిమంది బైక్‌మెకానిక్‌లు ర్యాలీ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

భోగాపురం: ప్రీ ప్లాస్టిక్ దినోత్సవంలో భాగంగా మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ఈ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు.

31లోగా కళాశాలలో చేరండి

నెల్లిమర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెలాఖరు వరకు గడువు ఉందని, విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ ఓ ప్రకటనలో గురువారం కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో పాటు ఒకేషనల్ గ్రూపులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 310 మంది కళాశాలలో చేరినట్లు పేర్కొన్నారు. కళాశాలలో చేరాలనుకునే వారు మరిన్ని వివరాలకు పనివేళల్లో కళాశాల సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. మండలంలోని ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే గురువారం సమావేశమయ్యారు. ప్రజాసమస్యలు, వాటి పరిష్కారంపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, ఫిర్యాదుల రిజిస్టర్ క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



మత్తు పదార్థాలపై లఘుచిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ గణేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలురు పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రచార రథంపై ప్రదర్శించిన లఘుచిత్రం ప్రదర్శన ద్వారా గురువారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లేకుంటే జీవితాలు నాశనమైపోతాయన్నారు. ప్రస్తుతం ఎంతో మంది యువత ఫ్యాషన్ మాయలో పడి తమ జీవితాలు చెడగొట్టుకుంటున్నారన్నారు. అందరూ మత్తు పదార్థాలకు దూరంగా ఆరోగ్యం బాగుండేలా చూసుకోవాలని ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కలెక్టరేట్ దగ్గరి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బాలాజీ మార్కెట్ ఫీడర్ వద్ద విద్యుత్ లైన్లను తాకే చెట్లకొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో కణపాక, భవానీనగర్, బీసీ కాలనీ, ఆర్టీవో ఆఫీస్, సాయిలలిత నగర్, సాయికీర్తన నగర్, ద్వారపూడి రోడ్డు, కోయినగర్ ప్రాంతాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

12న పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

నెల్లిమర్ల: పీఆర్(పంచాయతీరాజ్) మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నెల్లిమర్ల తాలూకా యూనిట్ ఎన్నికలు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ప్రకటన కాపీని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి తదితర సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని, నెల్లిమర్ల, గుర్ల మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదం

విజయనగరం టౌన్: ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదం చేస్తాయని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమానందం తెలిపారు. స్థానిక వీటీ అగ్రహారంలోని ఎన్‌టీసీ చర్చి, ఏఐసీసీ, కింగ్స్ బైబిల్ కళాశాల ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు గురువారం అవగాహన కలిగించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న క్రైస్తవ సంఘాలు అపోస్తులైన తోమా జ్ఞాపకార్థంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పెంతెకొస్తు పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డి.ఎలీషా మాట్లాడుతూ లోకానికి శాంతి అనుగ్రహించి, పాపుల ప్రాణ రక్షణకై క్రీస్తు ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు బాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పూలంగి సేవ



విజయనగరం టౌన్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో కొలువైన శ్రీనివాసునికి గురువారం పూలంగి సేవ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు పీవీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేకువజామున స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా స్వామిని అలంకరించారు.